క్లుప్తంగా

ఆడపిల్ల చదువు సమాజానికి వెలుగు


కలగంపూడిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా

యలమంచిలి: అమ్మాయిల చదువు ఆ కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా వెలుగు ఇస్తుందని, కాబట్టి ప్రతి ఆడపిల్లను బాగా చదివించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. కలగంపూడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆమె బేటీ బచావో-బేటీ పఢావో మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. మహిళ చట్టాలు, పోక్సో చట్టం, బాలికలను అసభ్యంగా తాకితే ఎలా ఎదుర్కోవాలి? లైంగిక వేధింపులపై ఏ విధంగా పోరాడాలి? తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.రామకృష్ణ పరమహంస, ఎంఎల్‌హెచ్‌పీ వి.మధులత, అంగన్‌వాడీ కార్యకర్త బి.జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలపై ఆసక్తిని పెంపొందించాలి


విద్యార్థులు తయారు చేసిన క్రాఫ్ట్ వర్కును పరిశీలిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: విద్యార్థులకు హస్తకళలపై ఆసక్తిని పెంచి వారి నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించేందుకు హస్తకళ సేవాకేంద్రం విజయవాడ వారి ఆధ్వర్యంలో నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు రెండు రోజులుగా ఇస్తున్న శిక్షణ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. విద్యార్థులకు హస్తకళలపై అవగాహనను పెంపొందించడంతో పాటు కళంకారీ, ఎంబ్రాయిడరీ, లేసు అల్లికలు, ఇమిటేషన్ జ్యూయలరీ ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు వాటి తయారీ విధానాలను గురించి వివరించారు. కార్యక్రమంలో హస్తకళల సేవాకేంద్రం ఏడీ అపర్ణలక్ష్మి, హస్తకళల అభివృద్ధి అధికారి సువర్చల, లేసు పార్కు మాజీ అధ్యక్షురాలు కె.సూర్యకుమారి, షేడ్ సంస్థ డైరెక్టర్ పీడీ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కల పంపిణీ


కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మొగల్తూరు: రైతులు తమ భూముల్లో ఉద్యానవన సాగు చేపట్టాలని ఎంపీపీ వి.బాబ్జిరాజు సూచించారు. మండలంలోని రామన్నపాలెంలో ఎంపిక చేసిన రైతులకు బుధవారం కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. రైతులకు కావాల్సిన మామిడి, కొబ్బరి, దానిమ్మ, జామ మొక్కలు అందిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఏ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చినగోపురంలో హుండీ చోరీ

పాలకొల్లుసెంట్రల్: స్థానిక శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో హుండీ పగులగొట్టి నగదు చోరీ చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.శంకర్ తెలిపిన వివరాలు ప్రకారం మంగళవారం వేకువజామున 2 నుంచి 3 గంటల సమయంలో ఆలయానికి తూర్పు ఈశాన్యంలో ఉన్న గేటు ద్వారా ఆలయం లోపలికి ఓ దొంగ వచ్చాడు. ధ్వజ స్తంభం సమీపంలో ఉన్న హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును దోచుకుని పారిపోయాడని తెలిపారు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డయ్యిందని అన్నారు. ఆలయంలో హుండీలు తెరిచి మూడు నెలలు అవుతుందని, చోరీకి గురైన హుండీలో సుమారు రూ. 5 వేలు వరకూ నగదు ఉండవచ్చని అన్నారు. చోరీపై బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఈఓ శంకరం తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

పెనుగొండ: ఆచంట వేమవరంలోని జడ్పీ పాఠశాల అభివృద్ధికి పూర్వపు ప్రధానోపాధ్యాయురాలు పి.విజయలక్ష్మి, రాజగోపాల్ దంపతులు రూ. 20 వేలు హెచ్‌ఎం నెక్కంటి కృష్ణవేణికి అందించారు. బుధవారం పాఠశాల సహాయకులు బండి ప్రసాద్ మాస్టారు ద్వారా విరాళం అందించారు. 2023-24 సంవత్సరానికి గాను 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎంపీ మౌనిక, నవీన, జి.పద్మజలకు నగదు బహుమతులు, మెమెంటోలు అందించారు.

నేడు జిల్లాస్థాయి పాటల పోటీలు

నరసాపురం: పట్టణంలోని వలందర్‌రేవు వద్ద గురువారం స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మదర్‌థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులకు జిల్లా స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు చెప్పారు. ఈ మేరకు బుధవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, విజేతలకు బహుమతులు అందిస్తామని స్పష్టం చేశారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా

గ్రామాల్లో ర్యాలీలు చేసిన విద్యార్థులు


నరసాపురం రూరల్: యర్రంశెట్టివారిపాలెంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నరసాపురం రూరల్: జాతీయ సమైక్యతను కాపాడటం మనందరి బాధ్యత అని యర్రంశెట్టిపాలెం సర్పంచ్ యర్రంశెట్టి నాగముత్యమాంబ అన్నారు. బుధవారం గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు సంయుక్తంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ నాయకుల త్యాగాలు గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ గొప్ప తనాన్ని వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. గ్రామంలోని పలు రహదారుల్లో భారీ మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తూ విద్యార్థులు చేసిన ర్యాలీ అందరినీ ఆకర్షించింది. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి బాబులు, ప్రధానోపాధ్యాయుడు కోలపర్తి శ్రీనివాస్, కార్యదర్శి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహారావు అన్నారు. బుధవారం స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి 150 జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు యువతలో దేశభక్తిని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కె.రాంబాబు, టి.రాధా మాదవి, అధ్యాపకులు రాజభూషణం, మురళి తదితరులు పాల్గొన్నారు.


పాలకొల్లు సెంట్రల్: జెండాలు పంపిణీ చేస్తున్న చాంబర్స్ విద్యార్థులు


నరసాపురం: షాపుల్లో జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు, న్యాయవాదులు

ఏఎస్ఎన్ఎం కళాశాలలో....

స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 78వ స్వాతంత్ర దినోత్సవాల్లో భాగంగా హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం:78వ స్వాతంత్ర్య వేడుకలు పట్టణంలో ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం శ్రీ సూర్యా విద్యాసంస్థల ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ ర్యాలీ ప్రారంభించారు. పట్టణంలో దుకాణాల వద్దకు వెళ్లి జాతీయ జెండాలు పంపిణీ చేశారు. శ్రీహరిపేట నుంచి అంబేద్కర్ సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జాతీయ నాయకుల విగ్రహాల వద్ద నివాళులు అర్పించారు. సూర్యా విద్యాసంస్థల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని యాళ్లవానిగరువు వైఎస్సార్ సీపీ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 9గంటలకు 78వ స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తున్నట్లు కార్యాలయ ప్రతినిధి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) జాతీయ పతాకావిష్కరణ చేస్తారని, అలాగే గాంధీ బొమ్మల సెంటర్ వద్ద కూడా పతాకావిష్కరణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పతాకావిష్కరణ వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా నాగేశ్వరరావు జయంతి


నాగేశ్వరరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బహుజన కులాల సంఘ సభ్యులు

పాలకొల్లుసెంట్రల్: బహుజన కులాల పోరాట యోధుడు జాన నాగేశ్వరరావు పోరాటం నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని బహుజన కులాల నాయకుడు చింతపల్లి గురుప్రసాద్ అన్నారు. బుధవారం వీవర్స్ కమ్యూనిటీ భవనం నందు జాన నాగేశ్వరరావు 95వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ బహుజన కులాల అభివృద్ధికి పోరాటం చేయడమే కాకుండా కళానైపుణ్యం కలిగిన వ్యక్తిని అని కొనియాడారు. ముందుగా స్థానిక లాకు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన నాగేశ్వరరావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు యర్రంశెట్టి వెంకటరత్నం, వీవర్స్ ఫ్రంట్ అధ్యక్షులు వట్టం గణేశ్వరరావు, మానెం బసవరాజు, సుబ్బరాజు, రామాంజుల పెద్దమధు పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పాలకొల్లు అర్బన్: యాదవ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కొండ్రు శ్రీనివాస్, మురికిత శివకుమార్, సొసైటీ కన్వీనర్ ఆవాల పెద్దిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరంలో పది, ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ ప్రోత్సాహకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను యాదవ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యుల నుంచి తీసుకుని, వాటిని పూర్తి చేసి ఈ నెల 25లోగా అందజేయాలని కోరారు. సొసైటీ ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాల నుంచి ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రతిభావంతులైన యాదవ విద్యార్థులకు నగదు, దుస్తులు, నోట్ పుస్తకాలు యాదవ సంఘ నాయకుల చేతుల మీదుగా అందించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 83411 93280 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకోవాలి


పెనుగొండలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: చెరుకువాడ జెడ్పీ పాఠశాలలో సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ డి.శుభాకరరావు అన్నారు. బుధవారం పెనుగొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మధ్యలో చదువు నిలిపివేసిన వారు నేరుగా పదో తరగతి పరీక్షలకు నేరుగా వెళ్లవచ్చునన్నారు. ఇతర వివరాలకు హెచ్‌ఎం భరణీకుమార్ నెంబర్ 94917 19783కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

విద్యతోనే దేశం అభివృద్ధి

పోడూరు: విద్యతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని సంధ్య మెరైన్స్ ఎండీ కొండ్రగుంట ఆనంద్‌కుమార్ అన్నారు. జిన్నూరులోని ఏఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థినులకు సంధ్యామెరైన్స్ తరపున బహూకరించిన రూ.1.70 లక్షల విలువైన 20 డ్యూయల్ డెస్కులను బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సంధ్యామెరైన్స్ ఎండీ ఆనంద్‌కుమార్‌ను గ్రామానికి చెందిన రైస్‌మిల్లర్ పెన్మెత్స రామచంద్ర రాజు, వసుధ ఫౌండేషన్ ఏరియా కోఆర్డినేటర్ పెన్మెత్స బుద్ధరాజు, హెచ్‌ఎం సీహెచ్.శివజ్యోతి, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలి


పెనుగొండ: మూడో రోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం


పాలకొల్లు అర్బన్: సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచనలు చేస్తున్న అధికారులు

పెనుగొండ: గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాట్లు, నిర్వహణలపై సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు ప్రత్యే శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ సున్నం శ్రీనివాస దొర అన్నారు. సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు మూడవ రోజు శిక్షణా తరగతులు పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌పై అవగాహన కల్పించడంతో పాటు, ఏపీ పంచాయతీ రాజ్ చట్టం 1994 సెక్షన్ 80, 81 సీసీ చార్జీల చెల్లింపులు, పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పరిశీలన అంశాలు పై అవగాహన కల్పించారు. మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి వెంకట రెడ్డి, ఎంటీటీలు విజయకుమార్, రామరాజు, శర్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంటలో.. ఆచంట లో ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. చట్టాలపై అవగాహనతో పాటు ప్రతి ఒక్కరూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.నరసింహ ప్రసాద్, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, వైస్ ఎంపీపీ యర్రగోప్పుల నాగరాజు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండల పరిషత్ కార్యాలయంలో గత మూడు రోజుల నుంచి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఈవోపీఆర్ కేఎం వైభవతి మాట్లాడుతూ వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్‌లకు ఇచ్చిన శిక్షణలో ఆన్‌లైన్ పరీక్ష విధానం ద్వారా మూల్యాంకన చేశారు. ట్రైనీ రిసోర్స్‌పర్సన్ బి.ఆనందబాబు, ఏకేవీ నాగయ్య, జయహర్ష, ఏటకొర్రా గోవిందరాజులు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు పాల్గొన్నారు.

గాంధీజీ నడియాడిన నేల మట్లపాలెం


మట్లపాలెం గ్రామంలోని గాంధీ పార్కు

యలమంచిలి: స్వాతంత్ర్య పోరాట కాలంలో రెండుసార్లు మహాత్మాగాంధీ వచ్చిన గ్రామంగా యలమంచిలి మండలంలోని మట్లపాలెం గ్రామం ప్రసిద్ధికెక్కింది. ఉప్పు సత్యాగ్రహాన్ని మహాత్మాగాంధీ దండి గ్రామంలో ప్రారంభించగా అదే రోజు మట్లపాలెం గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు పేరిచర్ల సుబ్బరాజు సత్యాగ్రహం చేశారు. అనంతర కాలంలో సుబ్బరాజు ఆహ్వానం మేరకు మహాత్మాగాంధీ, ఆయన సతీమణి కస్తూరిబాయి గాంధీ మట్లపాలెం వచ్చారు. ఆ రోజు కచేరి వద్ద గ్రామస్తులతో గాంధీజీ స్వాతంత్ర్యం గురించి ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కచేరీ శిథిలం కావడంతో ఆ ప్రదేశాన్ని గాంధీ స్మారకంగా అలాగే ఉంచారు. ఆ స్థలంలో జాతీయజెండా స్థూపం నిర్మించారు. సాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి సంవత్సరం ఆ స్థూపం వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు పేరిచర్ల సుబ్బరాజు కుటుంబ సభ్యులు జాతీయ జెండా ఎగురవేయడం ఆనవాయితీగా వస్తుంది.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

పాలకొల్లు సెంట్రల్: భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు చెత్త ప్రభావం ప్రజలపై ఎక్కువగా ఉండడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందని అందువల్ల ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా చెత్తను త్వరితగతిన నిర్మూలన చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మునిసిపల్ అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని 12 వ వార్డులో ఉన్న డంపింగ్ యార్డును సందర్శించి అందులో ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్తను ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా నిర్మూలిస్తున్న విదానాన్ని పరిశీలించి మునిసిపల్ కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ట్రీట్మెంట్ చేసిన చెత్త నుండి వచ్చిన మట్టిని ఖాళీ స్థలాల్లో పూడ్చేందుకు ఉపయోగించాలన్నారు. పట్టణంలో ఉన్న సుమారు 25 వేల మెట్రిక్ టన్నుల చెత్తను ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా నిర్మూలన చేసేందుకు రూ. 1.93 కోట్లతో ప్రభుత్వం ఓ ఏజెన్సీకి అప్పగించిందన్నారు. పట్టణంలో ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా అవగాహన కల్పించాలన్నారు.

రోడ్లపై తిరిగే పశువులపై ప్రత్యేక దృష్టి

రోడ్లపై విచ్చల విడిగా తిరుగుతున్న పశువులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముందుగా ఎవరి గోవులను వారు ఇంటికి తీసుకువెళ్లాలని మైక్ ద్వారా ప్రచారం చేయడంతో పాటు యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అయినప్పటికీ పశువుల యజమానులు స్పందించకపోయినట్లైతే వాటిని గోశాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్, మునిసిపల్ కమిషనర్ బి.విజయ సారధి, తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, డీఈ కె.రాజ్‌కుమార్, టీపీఓ కె.రామబ్రహ్మం, ఏఈలు సాంబశివుడు, సతీష్ తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితాను తనిఖీ చేయాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వై.రవికుమార్

పెనుమంట్ర: బూత్ లెవెల్ అధికారులు ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను సమర్ధవంతంగా తనిఖీలు నిర్వహించాలని తహసీల్దార్ వై.రవికుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన ఓటర్ల జాబితా పరిశీలనపై బూత్ లెవెల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఎల్ఓలు ఎన్నికల ప్రక్రియలో సమర్థవంతంగా పని చేయడంతో జిల్లా అధికారుల మన్ననలు అందుకోగలిగామని, అదే స్ఫూర్తితో పని చేసి గ్రామాల్లో అర్హత ఉన్న కొత్త ఓటర్లను గుర్తించడం, చనిపోయిన వారిని గుర్తించడం ఓటర్ల బదిలీపై వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.ఎలియమ్మ, సీనియర్ అసిస్టెంట్ కేవీవీ సుబ్బారావు, ఏఎస్ఓ పి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కుళాయిల ద్వారా మురుగునీరు

నరసాపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కుళాయిల నుంచి మురుగునీరు వస్తోంది. ముఖ్యంగా 30, 31 వార్డులు చినమామిడిపల్లి, స్టేషన్‌పేట ప్రాంతాల్లో క్లోరినేషన్ సవ్యంగా చేపట్టకుండా మంచినీటిని కుళాయిల నుంచి వదులుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

విద్యాదాతకు సత్కారం

పాలకొల్లు సెంట్రల్: ప్రతి ఒక్కరూ సేవాభావంతో పాటు దేశభక్తిని చాటుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పారిశ్రామిక వేత్త, విద్యా దాత కామిశెట్టి అయ్యప్ప నాయుడు అన్నారు. బుధవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలతో పాటు వివిధ విద్యా పాఠశాలలకు విద్యా సహాయం అందిస్తున్న దాత అయ్యప్ప నాయుడును ఘనంగా సత్కరించారు. అనంతరం దాతకు భరతమాత చిత్రపటాన్ని అందించారు.

జిల్లా కలెక్టర్‌కు అభినందన

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా సహకారం అందించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కోరారు. ఈ మేరకు బుధవారం భీమవరం కలెక్టరేట్ కార్యాలయలంలో జిల్లా కలెక్టర్ నాగరాణిని ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పాలకొల్లుకి చెందిన పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు.

సాగుతున్న సార్వా సాగు పనులు


మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెంలో నాట్లు వేస్తున్న కూలీలు (ఫైల్)

మొగల్తూరు: ఈ ఏడాది సార్వా సాగు పనులు సాగుతున్నాయి. కాలువలు వదిలినా చేలల్లోకి నీరు చేరకపోవడంతో సాగు పనులు ఆలస్యమయ్యాయి. దీంతో పాటు గత నెల విరివిగా వర్షాలు పడడంతో, ఈ నెల 10,11 తేదీల్లో కూడా వర్షాలు కురవడంతో ముందుగా ఊడ్చిన చేలు ముంపునకు గురయ్యాయి. ఆకుమడులు కూడా మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. అయితే ఇటీవల వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరి నాట్లు వేయడం ప్రారంభించారు. దీంతో మండలంలోని 1198 ఎకరాలకు సంబంధించి కేవలం 320 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేసుకోవడం పూర్తయ్యిందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఇటీవల మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారి పాలెం, శేరేపాలెం పంచాయతీ నవుదూరుగరువు, రామన్నపాలెం గ్రామాల్లో చేలల్లో నిలిచిన నీరు లాగడంతో వరినాట్లు వేస్తున్నారు. రైతులు ఎక్కువ మంది 140 నుంచి 145 రోజులకు పంట చేతికోచ్చే 1061, 1064, 1318 సంపద సృష్టి వంటి రకాల విత్తనాలను వినియోగించారని, రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు తమ సిబ్బంది అందుబాటులో ఉన్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాట్లు వేయడం మరింత ఆలస్యమైతే వెదజల్లే పద్ధతి పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మొగల్తూరు పంచాయతీ ఇంజేటివారిపాలెంలో సుమారు 20 ఎకరాల్లో వెదజల్లే పద్ధతి పాటించారని ఏఓ అబ్దుల్ రహీమ్ తెలిపారు.